క్లుప్తంగా

పంప్‌హౌస్‌కు పైప్‌లైన్ మెటీరియల్



కొండపేట పంప్‌హౌస్ వద్ద పైప్‌లైన్ మెటీరియల్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ వాటర్ వర్క్స్‌కు చెందిన పైప్‌లైన్ మెటీరియల్ ఎట్టకేలకు బుధవారం కొండపేట పంప్‌హౌస్‌కు చేరుకుంది. మూడు రోజులుగా రెండో వార్డు ట్రిపుల్ ఆర్ సెంటర్ వద్ద ఈ మెటీరియల్‌ను ఆరుబయట నిర్లక్ష్యంగా వదిలేశారు. స్థానికులు జోనల్ అధికారులకు తెలియజేయడంతో వారు స్పందించారు. అక్కడకు వెళ్లి చూడగా పైపులైన్లను కలిపేందుకు వినియోగించే మెటీరియల్ కొంత కాలంగా సంగివలసలో, తర్వాత ట్రిపుల్ ఆర్ సెంటర్ వద్ద ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయం భీమిలి జెడ్సీ రాముకు తెలియడంతో సిబ్బందిని పంపించి కొండపేట పంప్‌హౌస్ వద్దకు తరలించినట్టు తెలిసింది.

విద్యార్థులకు హిందీ సర్టిఫికెట్ల పంపిణీ



తాటితూరు హైస్కూల్‌లో హిందీ సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తగరపువలస: గత సెప్టెంబర్‌లో నిర్వహించిన దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బుధవారం తాటితూరు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళీధర్ మాట్లాడుతూ ప్రాథమిక నుంచి ప్రవీణ వరకు తమ విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు టి.ఎస్.వి.ప్రసాదరావు జాతీయ భాష హిందీని విద్యార్థులకు నేర్పించడం ద్వారా భాషాభివృద్ధికి దోహదపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అప్పలనాయుడు, సూర్యనారాయణ, తారకేశ్వరరావు, ప్రభావతి, విజయకుమారి, సునీత, కామేశ్వరి, దీనలత, కృష్ణవేణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణకు ఘన నివాళి



కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: సినీ నటుడు కృష్ణ మొదటి వర్ధంతి సందర్భంగా జీరుపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ సినీ జీవితంతో కృష్ణ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో చిల్ల గణేష్‌రెడ్డి, వెంపాడ వెంకటరమణ, జీరు భరత్‌రెడ్డి, బోర అప్పలరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన బార్బీ కంటెస్ట్ వేడుకలు



వేడుకల్లో శారద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజులపాటు జరిగిన బార్బీ కంటెస్ట్ వేడుకలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు రెడ్, పింక్ కలర్ కోడ్ డ్రెస్‌లతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు కరస్పాండెంట్ అనుపమ జ్యోతిర్మయి, డైరెక్టర్ చంద్రమౌళి బహుమతులు అందించారు.

జగన్‌తోనే నీతివంతమైన పాలన

• ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



గంభీరంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

ఆనందపురం : రాష్ట్ర ప్రజలకు నీతివంతమైన పాలన అందించడానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గంభీరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జెండాను, సంక్షేమ పథకాల ఫ్లెక్సీ బోర్డుని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వాడవాడలా వివరించాలని సూచించారు. ప్రతీ గ్రామంలోనూ ఈ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నారని, ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొంటున్నారన్నారు. మరలా జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం గంభీరంలో దోబీఖానాలు నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. వీటి నిర్మాణం పూర్తయితే చాలా కాలంగా రజకులకు ఉన్న సమస్య పరిష్కారం కానుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు బొట్టా ధనలక్ష్మి, నాయకులు బొట్టా రామకృష్ణ, ఇలిపిల్లి నరిసింగరావు, బోయి వెంకటరమణ, కోరాడ ముసిలి నాయుడు, ఉప్పాడ రామిరెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, తెడ్లాపు గోవింద్, ఉప్పాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్

కొమ్మాది: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో మాటలు చెప్పే నాయకులు కావాలో... పని చేసే నాయకులు కావాలో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో రంగులు వేసుకున్న నటులు, మోసం చేసే నాయకులు మాయమాటలు చెబితే ఎవరూ నమ్మొద్దని కోరారు. నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులను దూషిస్తే, నేటి వైఎస్సార్‌సీపీ పాలనలో మత్స్యకారులను ఉన్నత స్థానంలో నిలబెట్టిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడిదబోయిన రాములప్పడు, మత్స్యకార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మెండుగా ప్రజాబలం



బాందేవుపురంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: వైఎస్సార్ సీపీకి ప్రజాబలం మెండుగా ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మండలంలోని బాందేవుపురంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలకు పత్రికల బలం మాత్రమే ఉందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను దేశంలో అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో ఆ పార్టీ వారికే పింఛన్లు ఇచ్చేవారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అర్హతను ప్రామాణికంగా తీసుకుని, వివక్షకు తావులేకుండా అందరికీ పింఛన్లు ఇస్తున్నట్టు తెలిపారు. బాందేవుపురం సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల కోసం రూ.25 కోట్లు ఇప్పటి వరకూ ఇచ్చామన్నారు. 240 మందికి ఇళ్ల పట్టాలు జారీ చేశామన్నారు. చంద్రబాబు నెరవేర్చని హామీలు, సీఎం వైఎస్ జగన్ నెరవేర్చిన హామీలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాల ఫ్లెక్సీని, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ×వై ఏపీ నీడ్స్ జగన్‌€ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, సుంకర పైడినాయుడు, రామసింగు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మిథిలాపురి వుడా కాలనీలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మధురవాడ: కూరాకుల కులాన్ని రాష్ట్రంలో అన్ని చోట్లా బీసీ – ఏ జాబితాలో చేర్చినందుకు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో ఆ కులానికి చెందిన పలువురు బుధవారం సంబరాలు చేసుకున్నారు. ప్రాంతీయ పరిధులు లేకుండా అందరికీ రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి విశాఖ జిల్లా కూరాకుల సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ కోట ఆనంద్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సంఘాల అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమణమూర్తి, కూరాకుల సంఘం కార్యవర్గ సభ్యులు చోడవరపు వెంకటస్వామి, కోట సంజీవరావు, పి.రామారావు, చోడవరపు కరుణాసాగర్, అల్లాడ శ్రీనివాస్, కోట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రబీ సీజన్‌కు సబ్సిడీపై విత్తనాలు సిద్ధం

పద్మనాభం : రబీ సీజన్‌కు రైతులకు సబ్సిడీపై సరఫరా చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. రాగులు పది క్వింటాళ్లు, పెసర ఐదు క్వింటాళ్లు, మినుములు 15 క్వింటాళ్లు ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు పట్టుకుని రైతు భరోసా కేంద్రాలకు రావాలని ఆయన కోరారు.

చిత్రకళపై 19న వర్క్‌షాప్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఆర్కే బీచ్ కాళీమాతా మందిరం సమీపంలో బొగ్గుముక్కతో చిత్రకళపై ఉచిత వర్క్‌షాప్ నిర్వహించనున్నామని, ఔత్సాహికులు పాల్గొనవచ్చని సీనియర్ మేనేజర్ సాగర్ గౌతమ్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది

తగరపువలస: ఈ ఏడాది కూడా ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందని, దీనిపై ఎలాంటి అనుమానాలూ వద్దని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం భీమిలి మండలం దాకమర్రి, బోడమెట్టపాలెం పంచాయతీల ప్రజలతో మాట్లాడారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు భూములు దోపిడీకి గురయ్యాయన్నారు. వారిది దోచుకో, దాచుకో, పంచుకో విధానమని ఆరోపించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లినప్పుడు 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనతో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను సరిపోల్చి వివరించాలన్నారు. ఏది మంచి అయితే అది పుస్తకాల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని, సంక్షేమ పథకాల ప్రదర్శన పట్టికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్‌లు చెల్లూరి పైడప్పడు, ముద్దాడ అప్పయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, చెల్లూరి సంతోష్, పొట్నూరు చంద్రశేఖర్, ముద్దాడ సూరప్పడు, బోని శ్రీను, మొకర కృష్ణ, గెద్ద చిరంజీవి, ముద్దాడ రాము, నక్కా అప్పలసూరి, బోని నారాయణరావు, చెల్లూరి సన్యాసి, సురేష్ పాల్గొన్నారు.



దాకమర్రిలో సంక్షేమ పథకాల జాబితా ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

రహదారుల నిర్మాణానికే స్థల సేకరణ

ఆర్డీవో భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో కొమ్మాది, రుషికొండ, ఎండాడలో గ్రామ సభలు

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 పరిధిలో అసంపూర్తి రోడ్ల నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ రోడ్లలో అడ్డంకులు తొలగించేందుకు అన్ని మార్గాలు అన్వేషిస్తోంది. కొమ్మాది, రుషికొండ, ఎండాడలో రోడ్ల నిర్మాణానికి అడ్డంగా ఉండిపోయి, టీడీఆర్ తీసుకోవడానికి కూడా ముందుకు రాని వారిని ఒప్పించేందుకు వివిధ మార్గాలు అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా ల్యాండ్ పూలింగ్ స్థల సేకరణకు నోటీసులు జారీ చేసి బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం సర్వే నంబరు 100/పి లో 0.07 సెంట్ల సేకరణ కోసం కొమ్మాది వార్డు సచివాలయంలో మధ్యాహ్నం గ్రామ సభ నిర్వహించారు. బాధితులకు నోటీసులు అందజేసినా అభ్యంతరాలు లేదా సమ్మతి తెలియజేయడానికి ఎవ్వరూ రాలేదు. దీంతో అరగంట సేపు వేచి చూసి అధికారులు వెళ్లిపోయారు. అలాగే ఎండాడ 10/8 పిలో 0.07 సెంట్లు, రుషికొండలో సర్వే నంబరు 39/పి, 40/పిలో 0.225 సెంట్ల స్థల సేకరణ కోసం గ్రామ సభలు నిర్వహించారు. రుషికొండ, ఎండాడలో బాధితులు టీడీఆర్ తీసుకోవడానికి సమ్మతి, రోడ్డు నిర్మాణానికి సహకరించడానికి సమ్మతి తెలిపినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ – 2 ఏసీపీ షబ్‌నాస్ శాస్త్రి, విశాఖ రూరల్ మండల ఆర్‌ఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొమ్మాదిలో బాధితుల కోసం వేచి చూస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి తదితరులు

దీక్షాధారణ భక్తులకు నిత్యాన్నదానం ప్రారంభం



మద్దిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న నాయకులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



అన్నదానం ప్రారంభిస్తున్న రామకృష్ణానంద, తదితరులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురంలో శ్రీ అయ్యప్పస్వామి సేవా పీఠంలో దీక్షాధారణ భక్తులకు బుధవారం నిత్యాన్నదానం ప్రారంభించారు. ముందుగా సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు, అర్చకుడు పెంట వెంకటశర్మ ఆధ్వర్యంలో గోపూజ, లక్ష్మీగణపతి హోమం, అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వడ్లపూడికి చెందిన రామకృష్ణానంద చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. మొదటిరోజు 400 మంది స్వాములు అన్నప్రసాదం స్వీకరించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, కాశీరావు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, గుడ్డాల ఎల్లయ్య, మజ్జి వెంకటరావు, నీలాపు సూర్యనారాయణరెడ్డి, కంటుభుక్త వెంకన్న, కరుభుక్త అప్పలనారాయణ, కనకల అప్పలరాజు, కరుభుక్త రమణ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠం వద్ద మాలధారులకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నసంతర్పణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు ధరించిన వారికి వచ్చే నెల 20 వరకు మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఆర్థిక సహకారంతో మొదటి రోజు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భీమునిపట్నం ఎంపీపీ డి.వాసురాజు, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, గాడు శ్రీను పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఆనందపురం : పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని పోస్టల్ విభాగం సీనియర్ సూపరింటెండెంట్ ఆర్.రాహుల్ అన్నారు. ఆనందపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం పుస్తక హుండీకి చందక సూరిబాబు, కొట్యాడ రెడ్డిబాబు ఇంగ్లిష్ డిక్షనరీలు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బీవీఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం ఎంతో అవసరం

భీమునిపట్నం: విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్కరూ మంచి పుస్తకాలు చదవాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకులు త్రినాథ్ సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం శాఖ గ్రంథాలయం వద్ద నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ వినియోగం వల్ల పుస్తకాలు చదివే వారు బాగా తగ్గిపోతున్నారని, ఇది సరైనది కాదన్నారు. విద్యార్థులు పుస్తకాలు చదవాలని సూచించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలన్నీ గ్రంథాలయంలోనే లభ్యమవుతాయని, అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మాజీ కౌన్సిలర్ మైలిపల్లి లక్ష్మణరావు, గ్రంథాలయ అధికారి మహేష్ పాల్గొన్నారు.



ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలు తిలకిస్తున్న విద్యార్థులు

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మ తల్లిని బుధవారం ప్రత్యేకంగా తులసిమాలలు, పూలదండలతో అలంకరించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



గండిగుండంలో లబ్ధిదారుకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

• ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం కోసం కాకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గండిగుండంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని పాలించిన టీడీపీ నాయకులు రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని విమర్శించారు. వారి పాలనలో ప్రతి పథకంలోనూ అవినీతి చోటు చేసుకోవడంతో చంద్రబాబుతో సహా టీడీపీ నాయకులు జైలు పాలవుతున్నారని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి సీఎం అయిన వెంటనే పేదలకు ఉపయోగపడే విధంగా పథకాలను అమలు పరిచి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని వివరించారు. అవినీతికి ఆస్కారం లేకుండా, సిఫార్సులతో పని లేకుండా అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. గండిగుండం పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు రూ.18 కోట్లు వెచ్చించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు కాలువలు, సిమ్మెంట్ రోడ్లు నిర్మించాలని, కాలనీ ఇళ్లు మంజూరు చేయాలని కోరగా వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు పావాడ గౌతమి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, బలిరెడ్డి మహేష్, లెంక రాంబాబు, కోరాడ వెంకట రమణారావు, కర్రి నాయుడుబాబు, బంటు చిన్న, డోల గోవింద్, షిణగం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా జ్యూట్‌మిల్లు పరిసరాలు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు పరిసరాలు చీకటిపడితే మందుబాబులకు అడ్డాగా మారిపోతున్నాయి. దీంతో ఈ రహదారి మీదుగా శ్రీరామ్‌నగర్, మూలకుద్దు, బొగ్గులదిబ్బ, పెద్ద చెరువుగట్టు, చిట్టివలస పరిసర ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. మందుబాబుల నుంచి వెకిలి చేష్టలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి 10 గంటల తర్వాత కూడా ఇక్కడ కొత్తగా వేసిన ప్రైవేటు లే అవుట్, మిల్లు అవుట్‌గేట్ సమీపంలో శ్మశానవాటిక వద్ద నిర్మించిన గట్టు, శిథిలమైన జ్యూట్‌మిల్లు పరిసరాల్లో గుంపులుగా కూర్చుని మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లపై కూడా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఆ సమయంలో ఇతర ప్రాంతాల నుంచి పనులు ముగించుకుని వచ్చే భవన నిర్మాణ కార్మికులు, పద్మనాభం మండలం చిన్నాపురం జ్యూట్ మిల్లు నుంచి వచ్చే కార్మికులు, రాడ్ బైండింగ్, రజక వృత్తి పనులపై వచ్చేవారు ఒంటరిగా వెళ్లేందుకు సాహసించడం లేదు. వీరిలో మహిళలు ఉంటే ఆకతాయిలు ఇంకా చిల్లర చేష్టలకు పాల్పడుతున్నారు. మద్యం సీసాలు విసరడం, ఈలలు వేసి కవ్వించడం, అసభ్యకరంగా వేధింపులకు పాల్పడుతున్నారు. పోలీసుల నిఘా కొరవడటంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. రెండు రోజుల క్రితం ఇదే విధంగా ఇక్కడి లే – అవుట్‌లో తిష్ట వేసిన పోకిరీలు దారిన పోయేవారిపై జులుం ప్రదర్శిస్తుండగా ఆ సమయంలో చిట్టివలసకు చెందిన ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి అండగా నిలవడంతో ఆకతాయిలు తగ్గారు. జ్యూట్‌మిల్లు రామాలయం నుంచి మిల్లు అవుట్‌గేట్ వరకు పరిసరాలు చీకటిగా ఉండటంతో మందుబాబులు తిష్ట వేస్తున్నారు. పోలీసులు నిఘా ఉంచి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని చిట్టివలస ప్రజలు కోరుతున్నారు.



చిట్టివలస శివారులోని జ్యూట్‌మిల్లు వద్ద లే అవుట్‌లో మద్యం సీసాలు

సచివాలయాల్లో రోజూ 'స్పందన'

మధురవాడ: సచివాలయాల్లో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు స్పందన నిర్వహించాలని భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి ఆదేశించారు. సంబంధిత ఫిర్యాదులు నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన కొమ్మాది వార్డు సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొందరు సిబ్బంది యూనిఫారం వేసుకోకుండా ఉండడంపై ప్రశ్నించారు. రోజూ వారీ కార్యకలాపాలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు సచివాలయ సేవలపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. జీవీఎంసీ జోన్ – 2 ఏసీపీ షబ్‌నాస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.